రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



గోడౌన్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో డీసీసీబీ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో నిర్మించిన గోదామును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి ఏటా రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 చెల్లిస్తోందన్నారు. పంటలు దెబ్బతిన్న సమయంలో పంటల బీమాను పలు దఫాలుగా అందించిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. సొసైటీలు బ్యాంకులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

■ ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల కోసం ఆప్కాబ్‌లో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టారన్నారు. వాణిజ్య బ్యాంకుల తరహాలోనే తమ బ్యాంకులు అన్ని రుణాలు అందిస్తున్నాయని వివరించారు. జిల్లాకు ఆప్కాబ్ ద్వారా 18 గోడౌన్లు మంజూరయ్యాయని తెలిపారు.

■ డీసీసీబీ సీఈఓ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత ఆప్కాబ్ అప్పుల ఊబిలో నుంచి బయటికి వచ్చిందని చెప్పారు. లింగాపురం సొసైటీ జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కొత్తగా తాము మైక్రో సంచార ఏటీఎంలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు పంపడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ.3.87 కోట్ల రుణాలకు సంబంధించిన మెగా చెక్కును ఆవిష్కరించారు.

■ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ రాజారాంరెడ్డి, లింగాపురం సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు తుపాకుల ప్రతాప్‌రెడ్డి, తాళ్లమాపురం సర్పంచ్ మాచిరెడ్డి కొండారెడ్డి, ఉప్పరపల్లె సర్పంచ్ రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ నందిమండలం వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పేదల జీవన ప్రమాణాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ సచివాలయం ఆవరణలో మంగళవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి సచివాలయ పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.16.04 కోట్లు, పరోక్ష ప్రయోజనాల కింద రూ.11.30 కోట్లు చొప్పున మొత్తం రూ.27.34 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, పెద్దపోలిరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, మౌలాలి, చెంచయ్య, సర్పంచ్ జయరామిరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘన నివాళి



అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధులు అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, మనప్రజా సేవా సమితి వ్యవస్థాపకుడు అయూబ్‌ఖాన్, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాలిక్, బాదుల్లా, బాష, మహమ్మద్, ప్రసాద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె, ఖాదర్‌పల్లె గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక రకాలైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు ప్రజలతో కలసి ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వ్యవసాయాధికారి మ్యాగి, వైద్యాధికారి ఓబులేసు, డ్వాక్రా ఏపీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

గోపవరం : విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి (ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ) ఎస్.రమణ పేర్కొన్నారు. మంగళవారం బద్వేలులోని విద్యుత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి పనులపై వెంటనే స్పందించాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇంకా పలు విషయాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బద్వేలు డీఈఈ కుళాయప్ప, జూనియర్ అకౌంట్ ఈఫీసర్ జయప్ప, ఏఈలు చిన్నయ్య, షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందజేయాలి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రమణ

అట్లూరు : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందజేయాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ పేర్కొన్నారు. అట్లూరు మండల పరిధిలోని కొండూరు గ్రామంలో 33/11 సబ్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై సంతృప్తికర స్థాయిలో సేవలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కులాయప్ప, స్థానిక ఏఈ విజయ్‌కుమార్, జేఈ ఉమా పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



సభలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

పోరుమామిళ్ల : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పోరుమామిళ్లలో జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ విద్యావ్యవస్థను పోషిస్తూ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. చదువుకున్న అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని డిమాండ చేశారు. ఈ మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు రాహుల్, నాయక్, వినయ్, సహాయ కార్యదర్శి రవి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

26వ వార్డుకు రూ.26 కోట్ల నిధులు



తన పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తన సతీమణి రాచమల్లు రమాదేవి ప్రాతినిథ్యం వహిస్తున్న 26వ వార్డుకు గత నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రూ.26 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు 28వ సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు, కౌన్సిలర్‌గా ఉన్న తన సతీమణి రమాదేవితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. సచివాలయం పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే రాచమల్లు జన్మదినం ఈనెల 20న పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జి పాలగిరి ఖాజా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కోఆప్షన్ సభ్యురాలు నఫీసున్నీసా, ఏసీపీ మునిరత్నం, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

22న టాలెంట్ టెస్ట్

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట ఎంపీపీ పాఠశాలలో ఈ నెల 22వ తేదీ నుండి తాలూకా స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రమణారెడ్డి తెలిపారు.

5వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, మూడవ బహుమతి రూ.1500 అందజేస్తామన్నారు. అలాగే మండల స్థాయిలో 2, 3వ తరగతి విద్యార్థులకు కూడా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.1000, రెండవ బహుమతి రూ.500, మూడవ బహుమతి రూ.250 అందజేస్తామన్నారు. వివరాలకు 93982 30067 సంప్రదించాలని తెలిపారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొహిద్దీన్



న్యాయ సేవలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఖాజా మొహిద్దీన్

చాపాడు : ప్రజలందరూ న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొహిద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని కేతవరం గ్రామంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకూ ప్రతి ఒక్కరికీ చట్టాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మైనుద్దీన్, ఆర్‌ఐ ప్రవీణ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, పీపీ జ్వాలా నరసింహ శర్మ, ఎక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ కోరారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 37 మంది డ్రైవర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ నినాదాలు చేశారు. అంగన్‌వాడీల ఆందోళనకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రషీద్‌ఖాన్, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, టీడీపీ నాయకులు హరిత, మౌనిక, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు శ్రీను, నాగేంద్ర, హరిత మద్దతు తెలిపారు.

మైదుకూరు : మైదుకూరులో 8వ రోజు మంగళవారం అంగన్‌వాడీలు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి ఏఐటీయూసీ, అనుబంధ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు రోడ్డుపైనే వంట వండి భోజనాలు చేశారు.

పోరుమామిళ్ల : అంగన్వాడీలు మంగళవారం పోరుమామిళ్ల అంబేద్కర్ సర్కిల్‌లో వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకు ఆసార్ వీధిలో కేక్ కటింగ్ కార్యక్రమం, 9 గంటలకు శ్రీనివాసనగర్‌లోని మున్సిపల్ ఉర్దూ పాఠశాల భవనాల ప్రారంభం, 10.15 గంటలకు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ, 11 గంటలకు విజయేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం, 11.30 గంటలకు వెల్లాల సంజీవరాయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం రాజపాళెం టీటీడీ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆరాధనా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడురోడ్డు కేసీ కెనాల్ సమీపంలోని శ్రీ సద్గురు కాశినాయన మందిరంలో ఈ నెల 25, 26 వ తేదీల్లో 15వ ఆరాధనా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 25న కాశినాయనకు విశేష అభిషేకాలు, అర్చనలు, రాత్రి భజన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న పౌర్ణమి సందర్భంగా విశేష పూజలతో పాటు ప్రత్యేక అలంకరణ, కోలాటం, భక్తులకు అన్నదానం ఉంటాయన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. అలాగే 26న ఉదయం 9 గంటలకు ఒంటెద్దు బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు.

హస్తకళల చైర్‌పర్సన్ పదవీకాలం పొడిగింపు

జమ్మలమడుగు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మీ పదవీ కాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కాలంలో అన్ని వర్గాలకు సమున్నతమైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెలుతున్నారని ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న పొలతల చైర్మన్ నాగమల్లారెడ్డి

పెండ్లిమర్రి : గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పొలతల దేవస్థాన చైర్మన్ నాగమల్లారెడ్డి అన్నారు. మంగళవారం గంగనపల్లె హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సావిత్రిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.